క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ప్రత్తిపాడు: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం ప్రధాన ద్వారం వద్ద చేతికందే ఎత్తులో ఇదిగో ఇలా విద్యుత్ మీటర్ బాక్సు తెరిచి ఉంది. తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఇదే భవనంలో రైతు సేవా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నాయి. నిత్యం రైతులు, రోగులు వస్తుంటారు. పొరబాటున విద్యుత్ తీగలు పట్టుకుంటే ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు జయప్రదం చేయాలి



పెదకాకాని: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ కోరారు. గుంటూరు ఆటోనగర్ కాంప్లెక్స్ సెంటర్ వద్ద గల ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుప్పాల మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో విశాఖపట్నంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాటిబండ్ల దేవిద్రాజు. రామిశెట్టి శ్రీనివాసరావు, పి.ఈశ్వరరావు,, రామిరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి నూకరాజు శివ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య నీరాజనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. డాక్టర్ లలిత్ ప్రకాష్‌చంద్ర, డాక్టర్ ప్రవీణ్ నల్లపాటి, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శుభ గాత్రీ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక నాట్యాచార్యులు బీరక సురేష్ బాబు, శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కుమారి యశస్వి శుభగాత్రీ, రమ్య, నిఖిత, కీర్తన, చైత్ర, హాసిని, హన్సిక తదితరులు చక్కటి హావ భావాలతో నృత్యం చేశారు. నట్టువాంగంపై బీరక సురేష్‌బాబు, గాత్రం సీహెచ్.శాంతి, బంకుపల్లి విద్యాసాగర్ (నూజివీడు), వయోలిన్‌పై నాగేశ్వరరావు, మృదంగంపై వెంకట భరద్వాజ్, ఘటంపై ఏం.హరిబాబు, వేణువుతో వనమాలీ చక్కటి వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితాదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొన్నారు. చివరగా అతిథులు కళాకారుల్ని సత్కరించారు.

మాటలతో మస్కా కొట్టిన కేటుగాడు

ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, పర్సుతో పరారీ

మంగళగిరి: మాటలతో మస్కా కొట్టి ఓ కేటుగాడు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, పర్సుతో పరారైన ఘటన శనివారం మంగళగిరిలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యర్రబాలేనికి యెలిమిచర్ల దుర్గారావు ఆటోనగర్‌లోని ఓ హోటల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం ఓ ఆగంతకుడు అతడి వద్దకు వచ్చాడు. మంచి బియ్యం, గోధుమపిండి, నిత్యావసర సరకులు ఉన్నాయని, వాటితోపాటు మూడు లీటర్ల పెట్రోల్ రూ.వందని మాయమాటలు చెప్పాడు. అన్నీ కలిపి తక్కువకు రూ.1700 కే ఇస్తానని నమ్మబలికాడు. దుర్గారావు ఆ మాయ మాటల్ని నమ్మాడు. కుమారుడు సత్యసాయిని రమ్మని పిలిచి, ద్విచక్ర వాహనంపై ఆగంతకుడితో వెళ్లి సరుకులు తీసుకుని రావాలని చెప్పాడు. రైల్వే స్టేషన్ దగ్గరకు వెళ్లగానే ఆగంతకుడు వాహనం ఆపించి తాను ఎక్కాడు. సత్యసాయి సెల్‌ఫోన్ తీసుకుని తండ్రితో మాట్లాడుతుండగా దాన్ని లాక్కుని వాహనంపై పరారయ్యాడు. మోసంపై దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న ద్వాదశ గణపతుల విగ్రహాల ప్రతిష్ట

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులోని సిద్ధి వినాయక క్షేత్రంలో ఈనెల 19న ద్వాదశ గణపతుల విగ్రహాల వాయు ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు వెలుగూరి సత్యనారాయణ మూర్తి శనివారం తెలిపారు.

దళిత ద్రోహి కూటమి ప్రభుత్వం

- అంబేడ్కర్ స్మృతివనంపై దాడి హేయం
- వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన
- నల్లపాడులో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



నల్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం దాడులు, హత్యలు, దారుణాలు, అక్రమాలకు తెగబడుతోందని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నల్లపాడు 27వ డివిజన్ ఇన్‌చార్జ్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం వద్ద జరిగిన దాడికి నిరసనగా, రూరల్ మండలంలోని నల్లపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వ దళిత వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ శనివారం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యం మంటగలిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడా విధ్వంసాలకు ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ఏమాత్రం యత్నించడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో చల్లా పార్థురెడ్డి, గోగులపాటి నాగరాజు, దాసరి బుజ్జి, తురకా కోటి, సాల్మన్‌రాజు, దొప్పలపూడి వెంకయ్య, మోహనరావు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ



భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

గుంటూరు రూరల్: నగర శివారులోని అడవితక్కెళ్లపాడు ఎస్టీ గురుకుల పాఠశాలను శుక్రవారం రాత్రి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ మధ్యలో వర్షపు నీరు నిలబడి ఏపుగా పెరిగిన గడ్డిని చూసి నీరు నిలబడకుండా లెవలింగ్ పనులు చేపట్టేందుకు అవసరమైన అంచనాలు సమర్పించాలని జీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ శ్యామ్ సుందర్‌ను ఆదేశించారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఉన్నారని అధికారులు తెలిపారు. గురుకుల పాఠశాలలో 320 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 77 మంది మాత్రమే ఉన్నారని ప్రిన్సిపాల్ బాబ్లూనాయక్ కలెక్టర్‌కు వివరించారు. కనీసం 150 మంది గురుకుల పాఠశాలలో చేరేటట్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం గురుకుల పాఠశాలను పరిశీలించారు. గురుకుల పాఠశాలలోని వంట గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించి సూచనలు చేశారు. అప్పటికే వండిన రాత్రి భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందివ్వాలని సూచించారు. విద్యార్థుల ఆంగ్ల సామర్థ్యాన్ని పరిశీలించేందుకు భోజన పదార్థాల గురించి ఆంగ్లంలో వివరించాలని విద్యార్థులను అడిగారు. విద్యార్థులు సరిగా చెప్పలేకపోవడంతో ఉపాధ్యాయులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి శిరీష, గుంటూరు తూర్పు మండల తహసీల్దార్ ఫణీంద్ర, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమారి, జీఎంసీ డివిజనల్ ఇంజినీర్ హనీఫ్, కార్పొరేటర్ స్మిత పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నిల్వల్లో తేడాలుంటే కేసులు

ప్రత్తిపాడు సీఎస్ డీటీ పద్మజ



వంగిపురం రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఎస్ డీటీ పద్మజ

ప్రత్తిపాడు: రేషన్ షాపుల్లో సరుకు నిల్వల్లో ఏ మాత్రం తేడా ఉన్నా ఉపేక్షించేది లేదని ప్రత్తిపాడు పౌరసరఫరాల శాఖ డీటీ పద్మజ చెప్పారు. వంగిపురంలో 28వ నంబరు రేషన్ దుకాణంలో శనివారం సీఎస్ డీటీ పద్మజ స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లలో ఉన్న లెక్కలకు దుకాణంలో ఉన్న సరుకు నిల్వలకు మధ్య వ్యత్యాసాలను పరిశీలించారు. రిజిస్టర్ల ప్రకారం మొత్తం 151 బస్తాల రేషన్ బియ్యం ఉండాల్సి ఉన్నా.. 104 బస్తాలు మాత్రమే నిల్వ ఉన్నాయి. 47 బస్తాలు తేడా రావడంతో దుకాణ నిర్వాహకులపై 6ఏ కింద కేసు నమోదు చేస్తున్నట్లు డీటీ తెలిపారు. తగ్గిన బియ్యం సుమారు ఇరవై మూడున్నర క్వింటాళ్లు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రేషన్ డీలర్లు రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. సరుకుల నిల్వలు కచ్చితంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. తనిఖీల్లో వీఆర్వో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

14న విద్యార్థులకు పోటీలు

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ, స్వాతంత్ర్యానంతర పరిస్థితులు, స్వాతంత్ర్య పూర్వ పరిస్థితులపై ఈనెల 14న వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట హైస్కూల్లో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్ స్థాయిలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనం, వక్తృత్వంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, క్విజ్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని వివరించారు. విద్యార్థులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకునేందుకు ఎ.వి.ఎస్.ఎస్.ప్రసాద్ 9492614809, సాంబశివరావు 98497 89799 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. 14న ఉదయం తొమ్మిది గంటలలోగా పోటీలలో పాల్గొనే అభ్యర్థులు స్కూల్‌కు చేరుకోవాలని చెప్పారు.

చలపతి ఫార్మసీలో ముగిసిన జాతీయస్థాయి సదస్సు



బహుమతులు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు రూరల్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదికల ప్రకారం యాంటిబయాటిక్స్ నిరోధకత ప్రపంచంలో అన్ని ప్రాంతాలలో ప్రమాదకరంగా మారిందని గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సివిల్ సర్జన్ డాక్టర్ బి.పి.సతీష్‌కుమార్ తెలిపారు. రెండు రోజులుగా నగర శివారుల్లోని లాంలో చలపతి ఫార్మసీ కళాశాలలో అమరావతి రీజియన్ చాప్టర్, కళాశాల సంయుక్తాధ్వర్యంలో జరుగుతున్న యాంటి మైక్రోబయల్ స్టీవర్డ్‌షిప్, క్లినికల్ అప్రైజల్ 2024 జాతీయ స్థాయి సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ నూతన నిరోధక యంత్రాంగాలు పుట్టుకు వచ్చి ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందాయన్నారు. యాంటిబయాటిక్స్ ఎక్కువ ప్రభావవంతంగా మారటంతో న్యూమోనియా వంటి సాధారణ అంటువ్యాధులకూ చికిత్స చేయటం అసాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ సదస్సులో 170 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారని పేర్కొన్నారు. డాక్టర్ గౌతమ్‌కుమార్, డాక్టర్ నాగదుర్గలు సదస్సుకు సంబంధించిన అంశాలపై ప్లీనరీ సెషన్స్ నిర్వహించారన్నారు. రెండు రోజుల్లో 80 మందికిపైగా ఈ పోస్టర్లు ప్రదర్శించారని చెప్పారు. వీరిలో మైక్రోబయాలజీలో కేఎస్ ఫార్మసీ కళాశాల(కేఎల్ యూనివర్సిటీ) విద్యార్థి మహమ్మద్‌నూర్ ప్రథమ బహుమతి, ఏలూరుకు చెందిన సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థి జ్యోతిహరి ద్వితీయ బహుమతి, జొన్నలగడ్డ చెన్నపాటి అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థి డి.సుధీర్ కన్సొలేషన్ బహుమతులు దక్కించుకున్నారన్నారు. ఫార్మసీ ప్రాక్టీస్ విభాగంలో తమిళనాడుకు చెందిన సీఎస్‌బైడ్ మెహతా కళాశాల విద్యార్థి సౌందర్య ప్రథమ, చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థి షేక్ షర్మిల ద్వితీయ, ప్రియదర్శిని ఫార్మసీ కళాశాల విద్యార్థిని త్రిషికా కన్సొలేషన్ బహుమతులు దక్కించుకున్నట్టు వివరించారు. ఫార్మా కాలజీ విభాగంలో చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థిని షేక్ షబానా ప్రథమ, జొన్నలగడ్డ చెన్నపాటి అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థి జి. యోచన ద్వితీయ, చలపతి ఫార్మసీ విద్యార్థి జె శ్రేష్ఠ కన్సొలేషన్ బహుమతులు పొందారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధిపతి వైవీ ఆంజనేయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవానికి అడ్డుగా ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వు

విశ్రాంత అదనపు డీజీపీ బాబూరావు



నెహ్రూనగర్: మత స్వేచ్ఛ విషయంలో దళితులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్ని కొనసాగించాలంటే 1950 రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబూరావు పేర్కొన్నారు. ఏసీ కాలేజీలోని జేడీ శీలం హాలులో దళితులకెందుకు ప్రాథమిక హక్కులు నిరాకరించబడ్డాయి ? అనే అంశం మీద శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల వల్ల దళితులకు ప్రాథమిక హక్కులు నిరాకరించబడ్డాయన్నారు. దీని వల్ల మత స్వేచ్ఛ లేకుండా పోయిందని తెలిపారు. ఆర్టికల్ 14 చెప్పిన సమానత్వ హక్కును, ఆర్టికల్ 16 చెప్పిన సమాన అవకాశాలను 1950 నాటి ఉత్తర్వులు అడ్డుకుంటున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 విశ్వసించు, అనుసరించు, ప్రకటించు...అనే హక్కును పౌరులకు కల్పించిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కును రాష్ట్రపతి ఉత్తర్వు కాలరాసిందని పేర్కొన్నారు. 1950 ఆగస్టు 3న జరిగిన చర్చలలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌తో పాటు ఇతర సభ్యులు కూడా రాష్ట్రపతి ఉత్తర్వులను వ్యతిరేకించినట్లు ఆయన గుర్తు చేశారు. దళితుల ఆత్మగౌరవానికి, మత స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు అడ్డుగా ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి త్వరలో వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పులిగుజ్జు సురేష్, ఏసీ కాలేజీ ప్రిన్సిపాల్ కె. మోజెస్, హై కోర్టు లాయర్ గద్దం ఏలీషా, రిటైర్డ్ ఎస్పీ కాకుమాను రాజశేఖర్, శివశంకర్, సాల్మన్, విజయశేఖర్, కర్ర జోసెఫ్, సతీష్‌కుమార్, శోభన్‌బాబు, చిట్టిబాబు, పరిశపోగు మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

మంగళగిరి: నగరంలోని పలు కూడళ్లలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తామని తెలిపారు. అనుమానం ఉన్న వాహనాల్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపైనా కేసు నమోదు చేస్తామన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

డీఎస్పీ గోలి లక్ష్మయ్య



మాట్లాడుతున్న డీఎస్పీ గోలి లక్ష్మయ్య

ప్రత్తిపాడు: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని డీఎస్పీ గోలి లక్ష్మయ్య చెప్పారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ గోలి లక్ష్మయ్య హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థినులకు చదువుపై ఇష్టం ఉండాలన్నారు. అలాగే చదువుకోవడం వలన సమాజంలో గౌరవ, మర్యాదలు వస్తాయన్నారు. యువత తల్లిదండ్రుల మాట విని వినయంగా నడుచుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ తమ కళాశాలలో విలువలతో కూడిన విద్యను అందించడమే కాకుండా పోటీ ప్రపంచంలో మహిళలకు ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో బోధిస్తున్నట్టు చెప్పారు. కళాశాల బోధనా పద్ధతులు, సృజనాత్మక శైలి, క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ జె.కిషోర్ బాబు, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆచార్య కృపాచారి

తెనాలిఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. ప్రకాశం రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్స్ అకాడమి, జేపీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అతిథి గ్రాండ్‌లో కంప్యూటర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లతో సమయాన్ని వృథా చేసుకోకుండా ఉండాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు మారాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ కె.సుబ్రమణ్యం, అకాడమీ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్, జెట్టి ఎబినైజర్, ఎ.గిరిధర్, నూతలపాటి నాగేశ్వరరావు, యా బాలరాజు, షేక్ అబ్దుల్ హకీంజానీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు ‘మానవత’ ఉచిత శిక్షణ

నేటి నుంచి కుంచవరంలో ఆరంభం



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ కొలసాని రామ్‌చంద్

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత సంస్థ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భారత ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శనివారం విలేకరుల సమావేశంలో సంస్థ, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి తెనాలి సమీపంలోని కుంచవరం గ్రామంలో గల మానవత ప్రాంగణంలో ప్రతి ఆదివారం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనితోపాటు సంబంధిత పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు కటకం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్‌ను భారత ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఆదివారం జరిగే శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. వీరితో సంస్థ కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, ఉపాధ్యక్షుడు పరిమి శ్రీనివాస్, కార్యదర్శి పి.వెంకట్, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, డైరెక్టర్ కమిటీ సభ్యుడు చిట్టినేని సాంబశివరావు ఉన్నారు.

అర్హులకు ఉచిత న్యాయ సహాయం



పింఛన్ దరఖాస్తును న్యాయసేవాధికార సంస్థ సిబ్బందికి అందజేస్తున్న వృద్ధులు

తెనాలిరూరల్: అర్హులైన వారికి తెనాలి మండల న్యాయ సేవ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తారని, అవసరమైన వారు దానిని సద్వినియోగపర్చుకోవాలని ప్యానల్ న్యాయవాది అప్పల కిషోర్ తెలిపారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు తెనాలి మండలం, కఠెవరం గ్రామంలో వితంతు సామాజిక పింఛన్లపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించి చట్ట పరిధిలో వ్యవహరించాలన్నారు. చట్టాలను ప్రజలకు చేర వేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ భారత దేశంలోని ప్రజలందరికీ ఎటువంటి భేదాలు లేకుండా అందరికీ సమాంతర న్యాయం అందించాలనే లక్ష్యంతో 1987లో న్యాయ సేవల చట్టం ప్రవేశ పెట్టారని, 1995 నవంబరు 9వ తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. జాతీయ న్యాయ సేవాధికార మార్గదర్శకాలలో ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హులుగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి, సంవత్సరానికి రూ.లక్ష ఆదాయం లోపు ఉన్న వారిని, మహిళలకు, బాలలకు, యాచకులకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన వారికి, అసంఘటిత కార్మికులకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల న్యాయ సేవ సంస్థల్లో ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహిద్దీన్, పీఎల్‌వీ షేక్ మొహిద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యా బోధనలో ప్రమాణాలు అవసరం



మాట్లాడుతున్న విద్యావేత్త రమ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక విద్యా బోధనలో ఆధునికత్వంతో కూడిన ప్రమాణాలు అవసరమని నేషనల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం అతిథి ఉపన్యాసకురాలు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఆర్.కె.రమ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ ఉపాధ్యాయులకు జాతీయ విద్యా విధానం, జాతీయ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్‌తో పాటు చైల్డ్ ప్రొటెక్షన్ చట్టంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రమ మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధికి చిన్నతనంలోనే బాటలు వేయాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక విద్య పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ విద్య బోధిస్తున్న ఉపాధ్యాయులు తమను తాము మలచుకుంటూ బోధించాలని, తద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి పసితనంలోనే బాటలు వేసిన వారవుతారని పేర్కొన్నారు. గత దశాబ్దంగా పాత మూస బోధనలకు భిన్నంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన జాతీయ విద్యా విధానానికి రూపకల్పన చేస్తున్నారని తెలిపారు. కాలానుగుణంగా పిల్లల్లో వారి ఐక్యూస్థాయికి తగిన విధంగా సమగ్ర వికాసానికి బోధనాంశాలు ఉండాలని సూచించారు. ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్ చట్టాలపై విజ్ఞాన్ అధ్యాపకురాలు డాక్టర్ నాగమల్లేశ్వరి, అధ్యాపకురాలు రమ మావూరి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్, ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి


గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న దళిత క్రైస్తవ సంఘ నాయకులు

నెహ్రూనగర్: మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాల సమాఖ్య ప్రతినిధులు రెవరెండ్ జి.సతీష్ బాబు, పాదర్ చంద్రమోహన్ నుదురుపాటి ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రైస్తవ నిరసన దినం పాటించారు. గుంటూరు సెయింట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ చర్చి నుంచి ఆంథోనీ వారి చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సతీష్‌బాబు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే అంశాల్ని నిర్మూలించి, క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 1950 ఆగస్టు 10న తేదీన రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా వెలువడిన రాజ్యాంగ ఆర్డర్‌లోని మూడవ పేరాలో హిందూ మతంలో దళితులకు మాత్రమే ఎస్సీ కోటా వర్తిస్తుందని పేర్కొన్నారు. దీనిపై గత 70 సంవత్సరాలుగా వివాదం జరుగుతూనే ఉందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికపై అందరికీ సమానంగా రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని ఆయన కోరారు. ఫాదర్ చంద్రమోహన్ మాట్లాడుతూ దళితులు, గిరిజనులు ఏమతంలో ఉన్నా వారి సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంలో పెద్దగా మార్పులేదని పలు అధ్యయన సంస్థలు పేర్కొన్నాయన్నారు. చాలా మంది దళిత క్రైస్తవులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని, అన్ని రకాల దోపిడీకి, సామాజిక వివక్షకు గురవుతున్నారని జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ పేర్కొందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

చేబ్రోలు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, దీనికి విరుద్ధంగా ఉన్న జీవో నంబరు 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమకుమారి పేర్కొన్నారు. చేబ్రోలు మండలంలోని యూటీఎఫ్ కార్యాలయంపైన నూతనంగా నిర్మించిన లగడపాటి స్వరూప్ మీటింగ్ హాలును ఆమె శనివారం ప్రారంభించారు. గౌరవ అధ్యక్షులు ఐ.శ్రీనివాసరెడ్డి జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ మాజీ చైర్మన్ తాండవ కృష్ణ, రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, లగడపాటి కృష్ణ స్వరూప్ కుటుంబసభ్యులు కస్తూరి, కుమారుడు వేణుగోపాల్, సోదరుడు కోటయ్య, యూటీఎఫ్ నాయకులు ఎం.కళాధర్, డి. నాగేశ్వరరావు, వై.రమేష్ బాబు, వై.అన్నపూర్ణ పాల్గొన్నారు.